# మీడియా అకాడమీ చైర్మన్ ఎవరు..?

2లో..

**కొనసాగుతున్న సస్పెన్స్**

**జర్నలిస్టు పక్షపాతికే అవకాశం కల్పించాలంటున్న విలేఖరులు**

వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 180 బుధవారం | 17 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



4లో

## వైభవోపేతంగా అక్షింతల వితరణ

వడ్డేపల్లిలో ఇంటింటికీ చేర్చిన కార్పొరేటర్ అభినవ్ భాస్కర్

హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



8లో

ప్రధాని పిలుపుతో స్పందించిన బీజేపీ నేతలు

స్వచ్ఛ తీర్థ అభియాన్‌కు విశేష స్పందన

## దేవాలయాలు శుభ్రం



8లో

## మెరుగైన వసతులు కల్పించాలి

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

మంత్రి సీతక్కతో కలిసి వన దేవతల సందర్శన



# మేయర్ జంప్..?

## ముహూర్తం ఫిక్స్ చేసిన మేడమ్

**20న కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం**

**రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్న సుధారాణి**

**వ్యతిరేకిస్తున్న హస్తం నేతలు**

**పార్టీ వీడితే పదవీ గండం తప్పదంటున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు**

**ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా మారిన పరిస్థితి**

వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి పార్టీ మారడం ఖాయమైంది. ఈ నెల 20వ తేదీ దశమి రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకునేందుకు ఆమె రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేసిన పరిచయం నేడు మేయర్ పార్టీ మారేందుకు ఉపయోగ పడుతుందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే మంత్రి సీతక్కతో మంతనాలు జరిపిన సుధారాణి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు వైరలవుతోంది. అయితే పార్టీ మారుతున్నట్లు ప్రచారం ఊపందుకున్నా ఆమె ఎక్కడా ఖండించకపోవడం మరింత బలాన్ని చేకూర్చుతోంది. ఆమె ఏ పార్టీలోకి పోయినా పదవీ గండం తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆమె ఒంటెద్దు పోకడలతో ఏకాకిగా మిగలడం ఖాయమంటున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు 2లో..

# మేయర్ జంప్..?



ముహూర్తం ఫిక్స్ చేసిన మేడమ్

20న కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం

రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్న సుధారాణి

వ్యతిరేకిస్తున్న హస్తం నేతలు

పార్టీ వీడితే పదవీ గండం తప్పదంటున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా మారిన పరిస్థితి



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** వరంగల్ మహా నగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారు. విదేశాల్లో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరిగి రాష్ట్రానికి చేరుకోగానే ఆయన సమక్షంలో పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఈనెల 20 దశమి తిథి ఉన్నందున అదే కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అనువైన సమయంగా భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు కావాల్సిన గ్రౌండ్ వర్క్ ను పూర్తి చేసుకున్నట్లు వైరలవుతోంది. అయితే తెలుగుదేశం పార్టీనుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన గుండు సుధారాణి ఆ పార్టీలోనే రాజ్యసభ సభ్యురాలిగా, టీటీడీ బోర్డు మెంబర్ గా, పార్టీలో పలు కీలక పదవులను అనుభవించిన ఆమె అవకాశ వాదంతో ఆ పార్టీకి గుడ్ బై చెప్పి టీఆర్ ఎస్ లో చేరారు. ఇక్కడ కూడా మహిళా నాయకురాలిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు నివ్వడంతోపాటు నగర ప్రథమ పౌరురాలిగా అవకాశం కల్పించారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ ఎస్ పరాజయం పాలై ప్రతిపక్ష స్థానానికి పరిమితం కావడంతో అధికార దాహంతో ఆమె మరో మారు పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. పదవులకోసం పార్టీలు మారడం సుధారాణికి కొత్తేమి కాదని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు.

## వ్యతిరేకిస్తున్న హస్తం నేతలు..

గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని హస్తం నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆమె వ్యవహార శైలిని తప్పుబడుతున్నారు. ఒంటెద్దు పోకడలతో ఇప్పటికే కార్పొరేటర్లందరకీ ఆమె దూరమైనట్లు ప్రచారం సాగుతోంది. సొంత పార్టీ కార్పొరేటర్లు కూడా ఆమెను ఇష్టపడడంలేదు. ఎన్నికలకు ముందు బీఆర్ ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన పద్మశాలి కులానికే చెందిన గుండేటి నరేందర్ మేయర్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న ప్రచారంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఆమె రాకను నరేందర్ తో పాటు పలువురు బీఆర్ ఎస్ కార్పొరేటర్లు కూడా తీవ్రంగానే వ్యతిరేకిస్తున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకున్నట్లుగా సుధారాణి కులం పేరు చెప్పుకొని పదవులను అనుభవిస్తున్నారంటూ మండిపడుతున్నారు. పద్మశాలీల్లో మెజార్టీ సభ్యులు ఆమెను వ్యతిరేకిస్తున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ దంపతులతో కూడా సుధారాణికి సఖ్యత లేదు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ సైతం ఆమెను గద్దె దింపాలన్న లక్ష్యంతోనే అవిశ్వాసానికి అండగా నిలుస్తున్నారు. ప్రజలతో, నాయకులతో సత్సంబంధాలు లేని సుధారాణిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా పార్టీకి చెడ్డ పేరు వస్తుందంటున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సైతం సుధారాణి పట్ల అసంతృప్తితో ఉన్నారు. ఆమె గత ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తో అంటకాగుతూ పశ్చిమ నియోజకవర్గంలో ఇష్టానుసారంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఆమె నిర్లక్ష్యంతోనే పలు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయని, వేలాది మంది నిరాశ్రయులుగా మారారన్న ప్రచారం సాగుతోంది.

## ముందు నుయ్యి.. వెనుక గొయ్యి..

మేయర్ గుండు సుధారాణి పరిస్థితి ఇప్పుడు ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా మారింది. కార్పొరేటర్ల బలం లేని ఆమె ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నా పదవీ గండం తప్పేలా లేదు. పదవుల కోసం పార్టీలు మారుతారన్న చెడ్డపేరును ఆమె మూటగట్టుకున్నారు. బీఆర్ ఎస్ మేయర్ గా ఉంటే కాంగ్రెస్ పార్టీనుంచి అవిశ్వాసం ఎదుర్కోక తప్పదంటున్నారు. అదే కాంగ్రెస్ పార్టీలోకి పోతే బీఆర్ ఎస్ నుంచి అవిశ్వాసానికి సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది. పార్టీలకు అతీతంగా మెజార్టీ కార్పొరేటర్లు ఆమె తీరును బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. మూడు సంవత్సరాల పదవీ కాలం పూర్తి కాగానే ఏప్రిల్ లో ఆమెపై అవిశ్వాస తీర్మాణం ప్రవేశ పెట్టేందుకు కార్పొరేటర్లు ఇప్పటినుంచే కత్తులు నూరుతున్నారు. మేయర్ మీద ఉన్న వ్యతిరేకతతో ఇప్పటికే 14మంది తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో బల్దియాలో కాంగ్రెస్ పార్టీ బలం గణనీయంగా పెరుగుతుంది. అప్పుడు అవిశ్వాసం పెట్టి సుధారాణిని గద్దె దింపాలన్న ఆలోచనలో ఉన్నారు. అయితే ముందుగానే మేల్కొన్న మేయర్ గుండు సుధారాణి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పావులు కదుపడంతో కార్పొరేటర్లు డైలమాలో పడ్డారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరితో వారంతా బీఆర్ ఎస్ పార్టీలోనే ఉండి మేయర్ పై అవిశ్వాసం పెట్టి గద్దె దింపాలని భావిస్తున్నారు.

## దొరల పోకడలు..

ఇంతకాలం దొరల పార్టీలో పనిచేసిన గుండు సుధారాణి దొరల పోకడలనే అనుసరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏమాత్రం పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. ఎవరూ తన ఇంటికి రావద్దంటూ హుకుం జారీ చేయడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ఆమె దగ్గరకు వచ్చే వారికి చీదరింపులు తప్పడం లేదని పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరు కూడా తనకు స్వయంగా ఫోన్ చేయరాదన్న ఆదేశాలను ఆమె అమలు చేస్తున్నట్లు పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు. ఏదైనా అవసరం ఉంటే మెసేజ్ మాత్రమే పెట్టాలంటూ ఆమె ప్రకటించడంతో పార్టీ శ్రేణులు ఒక్కొక్కరూ ఆమెకు దూరమవుతున్నారు. దీంతో రానున్న రోజుల్లో ఆమె ఒంటరిగా మిగలడం ఖాయమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# మీడియా అకాడమీ చైర్మన్ ఎవరు..?

కొనసాగుతున్న సస్పెన్స్

జర్నలిస్టు పక్షపాతికే అవకాశం కల్పించాలంటున్న విలేఖరులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు మొదలైంది. మీడియా అకాడమీ చైర్మన్‌గా ఎవరిని నియమిస్తారంటూ జర్నలిస్టు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏ జర్నలిస్టు యూనియన్‌తో సంబంధాలు లేకుండా తటస్థంగా ఉండే సీనియర్ జర్నలిస్టును నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అంశాన్ని పలువురు మంత్రుల దృష్టికి వ్యక్తిగతంగా కొద్దిమంది జర్నలిస్టులు తీసుకెళ్లారు. యూనియన్లతో సంబంధాలున్న వ్యక్తి చైర్మన్‌గా ఉంటే న్యూట్రల్‌గా ఆలోచించే అవకాశాలు ఉండకపోవచ్చని, సొంత యూనియన్ అభిప్రాయాలే నిర్వహణలోనూ ప్రతిబింబిస్తాయన్నది పాత్రికేయుల అనుమానం. దీన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని సంఘాల పట్ల సమాన దృక్పథంతో వ్యవహరించేలా, అందరినీ కలుపుకుపోయేలా ఉండే వ్యక్తిని నియమించడం సహేతుకంగా ఉంటుందంటున్నారు.

మీడియా అకాడమీ చైర్మన్‌ను ప్రభుత్వం ఎప్పుడు నియమిస్తుందనే అంశం కొలిక్కి రాకపోయినా దాని నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఆలోచించి యూనియన్లలో యాక్టివ్‌గా లేని, నాయకత్వ బాధ్యతల్లో లేని వ్యక్తిని నియమించడం ద్వారా జర్నలిస్టులంతా స్వేచ్ఛగా వారి సమస్యలను, అభిప్రాయాలను షేర్ చేసుకునే వీలు ఉంటుందన్నది దీని ప్రధాన ఉద్దేశం. గత పాలనలో అల్లం నారాయణ అకాడమీ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం కొనసాగారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఎక్స్ టెన్షన్ పేరుతో ఆయన కంటిన్యూ అయ్యారు. ఒక యూనియన్‌కు ఆయన ప్రాతినిధ్యం వహించడంతో ఇతర యూనియన్లు అకాడమీని సంప్రదించడానికి ఆసక్తి చూపలేదు. కొత్త ప్రభుత్వంలోనూ ఇదే ట్రెండ్ కొనసాగరాదన్న భావనతో మంత్రుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. యావత్తు జర్నలిస్టు కమ్యూనిటీ సంతృప్తి చెందేలా ప్రభుత్వం చైర్మన్ నియామకం విషయంలో ఆలోచించాలని మంత్రులను కోరుతున్నారు.

అక్రెడిటేషన్ కార్డులు, గృహ వసతి (ఇండ్ల స్థలాల), చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిస్తామని, త్వరలోనే యూనియన్ లీడర్లతో సమావేశం నిర్వహిస్తామని సమాచార పౌర సంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల పలు సంఘాల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టుల సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉండి, అన్ని సంఘాల పాత్రికేయుల విశ్వాసాన్ని చూరొగనేలా, యూనియన్ యాక్టివిటీస్‌లో నాయకత్వ బాధ్యతల్లో లేని, న్యూట్రల్‌గా ఉండే సీనియర్ జర్నలిస్టును చైర్మన్‌గా నియమించడం ద్వారా ప్రభుత్వం ఆశించిన లక్ష్యంతో పాటు సమస్యలకు తగిన పరిష్కారం లభించే అవకాశం ఉందన్నది జర్నలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

# అవినీతిపై విచారణ చేపట్టాలి

కలెక్టర్‌కు టెక్స్ టైల్ పార్క్ బాధితుల వినతి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** సొసైటీ సభ్యులను నమ్మించి మోసం చేసిన విషయంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పందించి బాధిత లబ్దిదారులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం వినతి పత్రాన్ని సమర్పించారు. మడికొండ టెక్స్ టైల్ పార్క్ పాలక వర్గం, బిల్డర్లు, కెనరా బ్యాంక్ అధికారులు కుమ్మక్కై నిరక్షరాస్యులైన చేనేత లబ్ధిదారులను నమ్మించి మోసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వలస కార్మికుల నిర్మూలనలో భాగంగా కార్మికులకు ఉపాధి కల్పించేందుకు అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో, స్మాల్ ఎంటర్ ప్రైజెస్ (సీజీటీఎంఎస్ఈ ) స్కీం కింద 2019 సంవత్సరంలో ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.92.50 లక్షల చొప్పున వరంగల్, హనుమకొండ కెనరా బ్యాంక్ బ్రాంచ్ ల ద్వారా నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో మడికొండ శివారులో 60 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సొసైటీకి సంబంధించిన 364 మంది సభ్యులకు ఒక్కొక్కరికి 450 చదరపు మీటర్ల చొప్పున ప్లాట్లుగా చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కేటాయించారు. ఈ నిధులతో పాలక వర్గం పాత మిషనరీకి రంగులు వేసి రూ.41.75లక్షల విలువ చేసే మిషన్లకు తీసుకొచ్చి అంటగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా లబ్ధిదారులకు తెలియకుండానే షెడ్డు నిర్మాణం పూర్తి చేసి రూ.40లక్షలపే బిల్డర్ల ఖాతాలోకి ట్రాన్స్ఫర్ చేశారన్నారు. నాణ్యతలేని షెడ్డు నిర్మాణాలు, పాత మిషన్లు తీసుకు వచ్చి ఒక్కొక్క లబ్ధిదారుడి రూ.35 నుంచి రూ.40 లక్షల వరకు మోసం చేశారన్నారు. అక్రమంగా తీసుకున్న డబ్బులు లబ్దిదారుల దగ్గర ఉంటే పార్క్ మూత పడే దుస్థితికి రాకుండా ఉండేదని లబ్దిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలచే విచారణ జరిపించి న్యాయం చేయాలని బాధిత లబ్దిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# రైతులకు రైతు భరోసా వేయాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రంలో సీపీఐ మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశం గొరిగె సోమయ్య అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా జనగామ జిల్లా కార్యదర్శి వర్గం సభ్యుడు ఆది సాయన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బంధు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. రబీ సీజన్ మొదలై నెల రోజులు దాటి పోతుందని, రైతు బంధు ఇంతవరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే రైతులకు రైతు బంధు వెంటనే వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జనగామ జిల్లా కార్యదర్శి వర్గం సభ్యుడు కావటి యాదగిరి, మండల కమిటీ సభ్యులు మడికంటి సోమయ్య, ముప్పిడి ఎల్లయ్య, చాడ ఎల్లయ్య, పండుగ మల్లేషం, బాల్నె ఉదయ్, చిట్యాల ఉప్పలయ్య, జెనిగల అంజయ్య, ఉడుముల జయమ్మ, కంబల వెంకన్న, తుడి శ్రీను, తుడి రేణుబాబు, కోమటిరెడ్డి నర్సిరెడ్డి, సింగారం నర్సింగరావు, బిర్రు నగేష్, బస్కార్ శేశిరేఖ, కవిత, ఉడుత మల్లేషం తదితరులు పాల్గొన్నారని మండల సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి తెలిపారు.

# శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న చల్లా జ్యోతి



**వరంగల్ వాయిస్, పరకాల :** దామెర మండలం ఊరుగొండ గ్రామంలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య రామయ్య అక్షింతల వితరణ





**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండలంలోని ఆలేరు గ్రామంలో పలు వార్డులలో 45 రోజులు అయ్యప్ప మాలను ధరించి నియమ, నిష్టలతో మణికంఠుడికి పూజలను ఘనంగా నిర్వహించి ఇరుముడిని స్వామివారికి అప్పగించిన అనంతరం అయోధ్య శ్రీ రాముడి అక్షింతల వితరణ కార్యక్రమానికి నిర్వహించారు. శ్రీరాముడి అక్షింతలను, ఆహ్వాన పత్రికను గడపగడపకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి వారి గృహాల్లో ఏ విధంగా దీపాలు వెలిగించి పూజలు చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి దూలం రాజయ్య, తెడ్డు జనార్ధన్, తెడ్డు సాయి మణికంఠ, పగిడి పాల మహేష్, బానోత్ రమేష్, ముత్యాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఏకశిలా పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలతో నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లి, ఏకశిలా పార్కులో గల జయశంకర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణలో తొలి దశ, మలిదశ ఉద్యమ కారులను ఏకం చేసి తెలంగాణ సాధనలో స్వరాష్ట్ర సాధనే ధ్యేయంగా మేధావులను, విద్యార్థులను, విద్యావంతులను, అందర్నీ కూడా ఏకతాటిపైకి తీసుకువచ్చి, తెలంగాణ ప్రజలకు జరుగుతున్నటువంటి అన్యాయాన్ని పదుల నుంచి పది లక్షల మంది వరకు గల సభలను, సమావేశాలను నిర్వహించి, అందర్నీ చైతన్యపరిచి, తెలంగాణ జాతిపితగా ఉన్నటువంటి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కొంతమంది దుండగులు హైదరాబాదులోని ఆల్విన్ కాలనీలో ధ్వంసం చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. తెలంగాణ వ్యతిరేకులు ధ్వంసం చేస్తుంటే ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. స్వయంగా పోలీస్ అధికారులు అక్కడ ఉన్నా కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, విగ్రహం ధ్వంసం చేస్తుంటే కనీసం వారిని ఆపలేకపోయారన్నారు. ఈ దుశ్చర్యను పరిగణలోకి తీసుకొని, పెద్ద ఎత్తున తెలంగాణ వాదులు, ఉద్యమకారులు, బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలుపుతున్నామన్నారు. హనుమకొండ ఏకశిలా పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. ప్రభుత్వమే చొరవ తీసుకొని దుండగులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. అదే స్థలంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని పునర్ ప్రతిష్టాపన చేయాలని అన్నారు. లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అంటే యావత్ తెలంగాణ వాదులపైన, తెలంగాణ ప్రజానీకం పైన దాడిగానే పరిగణిస్తున్నామని అన్నారు. మహనీయుల విగ్రహాలకు ఈ ప్రభుత్వంలో భద్రత లేదంటే, సామాన్య ప్రజానీకానికి ఎటువంటి భద్రత ఉంటుందో ప్రజలంతా ఆలోచించాలన్నారు. ఏది ఏమైనప్పటికీ కూడా వెంటనే దోషులను శిక్షించి, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్లు సుందర్ రాజు యాదవ్, మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఉమ్మడి జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్ ను అటవీ పర్యావరణం, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, పశ్చిమ కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్, పదో డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట పవన్, జిల్లా మున్నూరు కాపు సంఘ నాయకులు, ఉపాధ్యక్షుడు పాటి శ్రీనివాస్, కార్యదర్శి పేరుకారి శ్రీధర్, పూజారి సత్యనారాయణ, మాదాసు మొగిలయ్య, ముప్ప వేణు, కర్ర సుదర్శన్, శ్రీధర్, నీలారపు శ్రీనివాస్, ఒడిదల రాము తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐ మాధవ్ గౌడ్‌కు ఆత్మీయ సన్మానం



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తీగల మాధవ్ గౌడ్ ను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు చేవ్వ శేషగిరి యాదవ్ నేతృత్వంలో బుధవారం బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్ చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి స్వీట్లు తినిపించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాధవ్ గౌడ్ మాట్లాడారు. మండలంలో క్రైమ్ రేట్ పెరగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ముఖ్యంగా యువత డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు మండలంలోని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. దీంతో బీజేపీ నాయకులు సానుకూలంగా స్పందించారు. మండలంలోని ప్రజల పట్ల ఎస్ఐ మాధవ్ గౌడ్ స్పందించిన తీరును బీజేపీ నాయకులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుమ్మరి సారయ్య, బండారి రవీందర్, బండారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సింజంట ప్రహార్‌తో రైతులకు సిరుల పంట



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని మల్లక్కపేట గ్రామంలో సింజంట హైబ్రిడ్ ప్రహార్ మిరప రకం గ్రామంలోని దొమ్మటి కుమారస్వామి ఒక ఎకరా 16గుంటల్లో సాగు చేస్తున్నారు. మొదట కోతగాను 19 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని దొమ్మటి కుమారస్వామి తెలిపారు. మళ్లీ మొక్కలకు రెండవ స్టెప్పులు వచ్చి కాపు విపరీతంగా కాయడం జరిగిందన్నారు. సెకండ్ కాపు దాదాపు 30 నుంచి 35 కిలోమీటర్ల వరకు వస్తుందని రైతు సంతోషం వ్యక్తం చేశాడు. సింజంట కంపెనీ ప్రతినిధులు ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాల ప్రతినిధి గణపతి రెడ్డి, డెవలప్ మెంట్ ఆఫీసర్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ రకం హైబ్రిడ్ మిర్చికి మూడు స్టెప్పులుగా వచ్చి మల్లెపూ పూత లాగా వచ్చి అధిక కాపు, అధిక దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఈ రకం మిర్చికి తెగుళ్లు సోకడం చాలా తక్కువని అన్నారు. ఈ రకం మిర్చికి ఘాటు ఎక్కువ ఉంటుంది. దీంతో మార్కెట్లో ఈ మిర్చికి డిమాండ్ ఎక్కువగా ఉంటుందని సింజంట ప్రతినిధులు తెలిపారు. ఈ రకానికి మార్కెట్లో డిమాండ్ ఉండడం వల్ల ఐటీసీ, బిగ్ హార్ట్ కంపెనీ వారు మార్కెట్లో పలికే ధర కంటే ఎక్కువ రేటు పెట్టి రైతుల దగ్గర కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ రకం మిర్చి ప్రదర్శన చూసిన సుమారు 100 నుంచి 150రైతులు ఈ రకాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం గాను, ఈ రకం మిర్చిని నాటి అధిక దిగుబడులు పొందుదామని అన్నారు. ఈ రకం మిర్చి సీడ్స్ వరంగల్, పరకాల, భూపాలపల్లి డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల దగ్గర లభించునని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింజంట డిస్ట్రిబ్యూటర్ అయ్యప్ప ఏజెన్సీస్ పాత రవీందర్, మల్లక్కపేట, నాగారం, రాయపర్తి, వెంకటాపూర్, నర్సక్కపల్లి, సీతారాంపురం, పైడిపల్లి, చుట్టుపక్కల గ్రామాలు రైతులు దొమ్మటి కుమారస్వామి, పైడిపాల బాబురావు, బొజ్జం రామకృష్ణ, తాటి కంటి గోవర్ధన్, రాజేందర్, వెంకటేశ్వర్లు, బొజ్జం సాంబయ్య, సంగం సారయ్య చాలామంది రైతులు క్షేత్రాన్ని సందర్శించడం జరిగింది.

# నగరంలో 'అమ్మ ఆక్రోశం'షార్ట్ ఫిలిం షూటింగ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పెడదారి పడుతున్న యువతకు కనువిప్పు కల్గించే విధంగా రూపొందించిన 'అమ్మ ఆక్రోశం'షార్ట్ ఫిలిం షూటింగ్ మొదట బుధవారం హనుమకొండ నగరంలో ప్రారంభమైంది. హనుమకొండలోని ఆదర్శ లా కాలేజ్ లో కోర్టు సీన్ చిత్రీకరించారు. అంతకు ముందు తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చేర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ కెమెరా స్విచ్ ఆన్ చేసి లాంఛనంగా షూటింగ్ ను ప్రారంభించారు. అనంతరం యూనిట్ కళాకారులు ఆయా పాత్రలలో లీనమై నటించారు. ఈ షార్ట్ ఫిలింనకు తెలంగాణ ఆన్ లైన్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్(తౌమ్వాజా)రాష్ట్ర అధ్యక్షుడు అయిలు రమేష్ డైరక్షన్ చేయగా జడ్జి పాత్రలో ఐజేయూ కార్యవర్గ సభ్యుడు దాసరి కృష్ణారెడ్డి, టైపిస్టు పాత్రలో ఐజేయూ జాతీయ కౌన్సిల్ ఫార్మర్ మెంబర్, ధీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం నేత నటించారు. కెమెరామెన్ గా కిషోర్ వ్యవహరించారు. పాత్రలు పాత్రదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆద్యంతం సాగిన షూటింగ్ లో ఆసక్తికర సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ సందేశాత్మక చిత్రాలు సమాజానికి దోహదపడతాయన్నారు. ఎదిగిన కొడుకులు, కూతుర్లు ప్రేమ పేరుతో ఆదర్శ వివాహాలు చేసుకొని తల్లితండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్న తరుణంలో ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఒక తల్లి కోర్టు మెట్లు ఎక్కడంతో ఈ అంశంలో కోర్టు ఇచ్చిన తీర్పు సభ్య సమాజానికి కనువిప్పు కలిగించే విధంగా ఉందని బండా ప్రకాష్ ముదిరాజ్ అభిప్రాయపడ్డారు. పిల్లలు తల్లితండ్రుల ఆశలను ఆడియాశలు చేయకుండా చక్కగా ఉన్నత చదువులను అభ్యసించి ప్రయోజకులుగా ఎదిన తర్వాత వివాహాల వైపు ఆలోచించాలని బండా ప్రకాష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. చట్టాలను ఆసరా చేసుకొని మేజర్లమైనమని యువత తప్పుడు నిర్ణయాలు తీసుకోరాదని, భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని యువత ముందుకు సాగాలని బండా ప్రకాష్ ముదిరాజ్ సూచించారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే రేవూరి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** నడికూడ మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి బుధవారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. బుధవారం నడికూడ మండలంలోని ధర్మారం గ్రామంలో నక్కలక్ష్మి, నడికూడ గ్రామంలో గోళ్లేపల్లి రాజమ్మ, రాయపర్తి గ్రామంలో నారగాని శంకరయ్య, నార్లపూర్ గ్రామంలో బోగి రాజమ్మ, ఓరుగంటి భాగ్యలక్ష్మిలు మరణించగా వారి కుటుంబాలను పరామర్శించి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మనోధైర్యం కల్పించారు. కాగా రాయపర్తి గ్రామంలో గుండె సంబంధిత వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్న బండి శంకరయ్యను పరామర్శించి మెరుగైన వైద్యం అందేలా తాను సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి వెంట నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మల్ హల్ రావు, పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, రాయపర్తి గ్రామ ఎంపీటీసీ పర్నెం శ్రీలత మల్లారెడ్డి , ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి అయోధ్య శ్రీరాముడి అక్షింతలు



**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** హనుమాన్ దేవాలయంలో అర్చకులు వామన్ శర్మ అక్షింతల కలశానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గ్రామ వీధుల్లో డోలు, సన్నాయి మేళతాళల నడుమ జై శ్రీరామ్ నామస్మరణతో ఇంటింటికి వెళుతూ అయోధ్య శ్రీరాముని అక్షింతలను, కరపత్రాలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు వడ్డేపల్లి కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ డా.దాస్యం అభినవ్ భాస్కర్ పాల్గొని గ్రామ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ 500ఏళ్ల తర్వాత రామ్ లల్లా తన జన్మభూమికి తిరిగి వస్తున్న అద్భుత దినాన్ని గొప్ప దీపావళిగా జరుపుకోవాలని, చరిత్రలో జనవరి 22 సువర్ణ అక్షరాలతో లిఖించడం జరుగుతుందని అభినవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలంగాణ సహ సంయోజక్ ముడుపు యాదిరెడ్డి , వరంగల్ మహానగర సహ సంయోజక్ శ్రీరాం ఉదయ్, కార్య కారిని సభ్యులు నందాల చందర్ బాబు, నేలకొండ భాస్కర్ రావు, అర్చకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## జైశ్రీరామ్ జెండాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అయోధ్యలో 22న బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అందరూ రామనామ స్మరణతో రామ నామము మార్మోగాలనే ఉద్దేశంతో నగరంలోని అన్ని ప్రాంతాల భక్తులందరికీ శ్రీరామరక్ష ఉండాలని ఇంటి పైన జైశ్రీరామ్ అనే నినాదంతో ఉన్న సుమారు 3000 ఆంజనేయస్వామి సమేత జెండాలను పంపిణీ చేసినట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. జెండాలను అన్ని కాలనీలలోని ఇళ్లపై ఎగరవేయాలని పిలుపు నిచ్చారు. ఎవరికైనా జెండాలు కావలసిన గురుధామంలో సంప్రదించాల్సిందిగా కోరారు. నగరంలోని అన్ని వినాయక మండలులు, యువజన సంఘాలు ఈ కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మన సనాతన సంప్రదాయం ప్రకారం ప్రతి కాలనీలోని భక్తులు నగర సంకీర్తన చేయడం మన ఆనవాయితీ అని, అందుకే అందరు ఉదయమే నాలుగున్నర గంటలకు లేచి వాళ్ల కాలనీలో ఉన్న ఆలయం నుంచి కాలనీ సరిహద్దుల మేరకు నగర సంకీర్తన చేయవలసిందిగా పిలుపునిచ్చారు. బుధవారం సప్తదామంలో జరిగిన కార్యక్రమంలో దాదాపు 3వేల జెండాలను నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలకు, భక్తులకు ఆలయాలలో పంచడానికి వీలుగా అందజేసినట్లు పేర్కొన్నారు. మరిన్ని జెండాలు కావలసిన వాళ్లు 9848423133 నెంబర్ కు తెలియజేస్తే వారికి గురుదామంలో జెండాలు ఏర్పాటు చేయగలమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 60మంది వరకు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. అలాగే శుక్రవారం రథయాత్రని వరంగల్ ఆకారపు గుడి దగ్గర నుంచి ఎంజీఎం వరకు పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## 108 ఈఎంఆర్ఐలో ఉద్యోగ నియామకాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 108 ఈయంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్(ఈఎంటీ) ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ల 108 సేవల ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ తెలిపారు. కాబట్టి ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఒక జిరాక్స్ సెట్ ను వెంట తీసుకుని ప్రత్యక్షంగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. విద్యార్హతలు బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, జీ.యన్.యం, ఏయన్ యం, బీఎస్సీ యం.ఎల్.టీ, వయసు 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. సెలక్ట్ అయిన అభ్యర్థులు తప్పనిసరిగా మొదటి మూడు నెలలు హైదరాబాద్ లో పనిచేయవలసి ఉంటుందని ఉమ్మడి వరంగల్ జిల్లాల 108 సేవల ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ తెలిపారు. హనుమకొండ కలెక్టర్ ఆఫీసు.రూం.నెం.జీ32 లో 19న శుక్రవారం ఉదయం.9.30 నుంచి 2.30 గంటలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9121108726 సెల్ నెంబర్ లో సంప్రదించవచ్చని సూచించారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

## 200 రోజులకు చేరిన లయన్స్ క్లబ్ అన్నదాన కార్యక్రమం



**వరంగల్ వాయిస్, జనగామ :** అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, దాన్ని అవసరార్థులకు వితరణ చేయడం మహా భాగ్యమని లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ పూర్వ జిల్లా గవర్నర్ లు కన్న పరశురాములు, డా.డి.లవకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం చంపక్ హిల్స్ లోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా పరిధిలో ఉన్న రీజియన్ 6, 7సారధుల ఆధ్వర్యంలో గత 200రోజులుగా జనగామ ప్రభుత్వ మాత, శిశు సంరక్షణ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత నిత్య అల్పాహార వితరణ కార్యక్రమం జిల్లా గవర్నర్ ఎన్.వెంకటేశ్వర్ రావు మార్గదర్శనంలో విజయవంతమైందని పూర్వ గవర్నర్ లు అభినందించారు. ఇప్పటివరకు సుమారు పది లక్షల రూపాయలతో, ప్రతి నిత్యం ఉదయం 8:30గంటలకు సుమారు 300మంది అవసరార్థులకు, హాస్పిటల్ కు వచ్చే పేషెంట్ తాలూకు సహాయకులకు, నిరుపేదలకు నిర్విరామంగా ప్రతినిత్యం అందుబాటులో నాణ్యతతో కూడిన భోజనం అందించడం జరుగుతున్నదని రీజియన్ చైర్మన్లు కే.రాజశేఖరరెడ్డి, రాపాక విజయ్, కోఆర్డినేటర్లు జైన రమేష్, శ్రీ బాష్యం రఘు తెలియజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహాయ పడుతున్న వివిధ దాతలకు, జనగామ, పాలకుర్తి రీజియన్ ల పరిధిలోని జోన్ చైర్మన్లు, సుమారు 25 క్లబ్ ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, ముఖ్య నాయకుల కృషి ప్రశంసనీయమని తెలిపి కేక్, పండ్లు, స్వీట్లు పంచారు. ఇలాగే సంవత్సరం మొత్తం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ రోజు దాతలుగా ముందుకు వచ్చిన లయన్ ఉప్పుగల్ల రవీందర్, గ్యాట్ లీడర్ లయన్ గంగిశెట్టి ప్రమోద్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ బాధ్యులు మధు, సురేష్, పూర్వ రీజియన్ చైర్మన్లు సి.ఉపేందర్ రెడ్డి, అల్లాడి ప్రభాకర్, నాగబండి రవీందర్, కుర్రేముల యాదగిరి, గ్యాట్ లీడర్ కృష్ణ జీవన్ బజాజ్, జోన్ చైర్మన్ పప్పు వెంకట్ రెడ్డి, బజ్జూరి వేణుగోపాల్, రవీందర్ రెడ్డి, వివిధ క్లబ్ ల బాధ్యులు అల్లాడి మహేష్, అంబటి రాజయ్య, బీజ్జల నవీన్ గుప్తా, బచ్చు రమేష్, శివరామ కృష్ణ, వెంకట్ మల్లారెడ్డి, ఎంసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజాకలం తెలుగు దినపత్రిక హనుమకొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ముంజాల అనిల్ ఆధ్వర్యంలో బుధవారం 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బొల్లేపల్లి అశోక్, ఇండ్ల కమల్ కుమార్, సిద్దోజు రాకేష్, సుధాకర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నార్లపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రాజయ్య భార్య ఓరుగంటి భాగ్యలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబం సభ్యులను టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వరంగల్ పార్లమెంట్ కాంటెస్టేడ్ ఎంపీ దొమ్మటి సాంబయ్య బుధవారం పరామర్శించారు. వారి వెంట మాజీ గ్రంధాలయం చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, మండల బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, చర్లపల్లి చాడ రవీందర్ రెడ్డి, నందికొండ అనంత రెడ్డి, పింగిలి ప్రతాప్ రెడ్డి, శనిగరపు సాంబయ్య రిటైర్డ్ టీచర్, రామ్మూర్తి మంద రామ్ చందర్, పసుల రామేష్, అల్లం రఘునారాయణ, శనిగరం వీరేశామ్, బొచ్చు భాస్కర్, ఒంటెరు శ్రావణ్, పబ్బ శ్రీనివాస్, గుండెల్లి సాధన్ కుమార్, ఎండీ అలీ, బొచ్చు చిన్నికృష్ణ, గోవిందా సురేష్, మడికొండ రవి, మడికొండ జనార్ధన్, ఒంటెరు సుధాకర్, మడికొండ ప్రమోద్, ఒంటెరు వినయ్, మడికొండ మహేష్, తదితరులు ఉన్నారు.

# సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, కాజీపేట :** గత 35 సంవత్సరాలుగా శాస్త్రీయ ప్రచారం చేస్తున్న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్లను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్, బీసీ స్టడీ సర్కిల్ మాజీ డైరెక్టర్ ఎర్ర విజయ్ కుమార్ తో కలిసి ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు ఆధ్వర్యంలో కాజీపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డా.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలనాసక్తిని రేకెత్తించడానికి, సైన్స్ అధ్యయనాన్ని ప్రోత్సహించడానికి, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి ఇలాంటి సైన్స్ టాలెంట్ టెస్ట్ లు దోహదపడతాయన్నారు. 8,9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో జనవరి 22న, మండల స్థాయిలో జనవరి 27న, జిల్లాస్థాయిలో ఫిబ్రవరి 3న జరిగే పరీక్షల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సభ్యులు పాము రాజేష్ కుమార్, అభిషేక్ , సత్యనారాయణ, రమేష్ , భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల ప్రాణాలను రక్షించండి

## బొనగాని యాదగిరి గౌడ్



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** గీత కార్మికులందరికీ సేఫ్టీ మోకులను అందించి గీత కార్మికుల ప్రాణాలను కాపాడాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన గునిగంటి తిరుపతి గౌడ్ వృత్తిలో భాగంగా తాటి చెట్టు పై నుంచి పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ స్వగృహానికి వెళ్లి మృతుడి చిత్ర పటానికి నివాళులు అర్పించి, మృతిని కుటుంబ సభ్యులను, పిల్లలకు మనో ధైర్యాన్ని కల్పించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎక్స్ గ్రేషియోను గీత కార్మికుడి కుటుంబానికి ఇప్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, గ్రామ సర్పంచ్ పుట్ట ప్రతాప్ గౌడ్, గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు గునిగంటి రమేష్ గౌడ్, హనుమకొండ జిల్లా గౌడ సంఘం ఉపాధ్యక్షులు మండ రవి గౌడ్, గోడిశాల వినయ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం కమలాపురం మండల అధ్యక్షుడు అర్వేపల్లి సామ్రాజ్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల సైన్స్ బిల్డింగ్‌కు భూమి పూజ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలం చర్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ బిల్డింగ్ కు ఈడబ్ల్యూఐడీసీ కింద మంజూరైన రూ.13 లక్షల 50 వేల నిధులతో నిర్మించబడుతున్న సైన్స్ బిల్డింగ్ బుధవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యేగా మొదటిసారిగా గ్రామానికి వచ్చిన రేవూరి ప్రకాశ్ రెడ్డిని గ్రామ సర్పంచ్ తో పాటు వార్డ్ సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందించి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి గ్రామ సర్పంచ్ చాడా తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు సురుగుల కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, నాగారం సర్పంచ్ స్రవంతి దేవేందర్ రెడ్డి, రాయపర్తి ఎంపీటీసీ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతరెడ్డి, సమ్మిరెడ్డి, నారాయణ, వాసుదేవ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీలపై అవగాహన కల్పించాలి

## విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** రైతులకు సబ్సిడీల పై అవగాహన కల్పించాలని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. మరిపెడ మండల పరిషత్ కార్యలయంలో ఎంపిపీ గుగులోత్ అరుణ రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్టాడారు. వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు వ్యవసాయ పంటలతో పాటు సబ్సిడీల పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్ ఫామ్, డ్రాగన్ ఫ్రూట్ పంటలు పండించే విధంగా అధికారులు చూడాలన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ఒక్కరే ఉన్నారని, సంబందిత శాఖాధికారులతో చర్చించి డాక్టర్ల నియమాకానికి చర్యలు తీసుంటామన్నారు. ప్రజలకు మిషన్ భగీరథ నీరు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వారా చెరువులను నింపాలని సర్పంచ్ తాళ్లపల్లి శ్రీనివాస్ అధికారులను కోరారు. ఎమ్మెల్యే వెంటనే వ్యవసాయ పనులు సాగుతున్నాయి కాబట్టి, ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని, సాగునీటిని అందించాలని కోరారు. ఎమ్మెల్యేను పంచాయతీ కార్యదర్శులు సన్మానించి వారి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలోఎంపిపీ గుగులోత్ అరుణా రాంబాబు, జడ్పీటీసీ తేజావత్ శారదా రవీందర్, జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి, ఎంపీడీఓ ధన్ సింగ్, సూపర్ డెంట్ శేషశైనం, వ్యవసాయ, విద్యుత్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరి జాతర ఏర్పాట్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని తిరుమలగిరి గ్రామంలో శ్రీ బుగులోని గుట్ట శివారులో జరిగే సమ్మక్క సారక్క జరిగే జాతర పరిసర ప్రాంతాలను ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో, ఎంపీడీఓ గోడిసెల సురేందర్ గౌడ్, మండల స్పెషల్ ఆఫీసర్ సామెల్, మండల పంచాయతీ అధికారి రాంప్రసాద్, పీఆర్ ఏఈ సతీష్ బాబు పరిశీలించారు. ముందుగా వన దేవతలను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామంలో మినీ మేడారం ఫిబ్రవరిలో జరిగే జాతర సందర్భంగా జాతర ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. జాతర ప్రతి రెండు ఏండ్లకు ఒకసారి జరిగే మేడారం సమ్మక్క సారక్క జాతరకు భక్తుల సంఖ్య లక్షలలో ఉండడంతో మినీ మేడారంగా తిరుమలగిరి గుట్టల శివారున వెలసిన సమ్మక్క సారక్క జాతరకు రెండో మేడారం జాతరగా భక్తులు భావించి దైవదర్శనం చేసుకోవడం ఆనవాయితీ. గత దశాబ్ద కాలంగా తిరుమలగిరి సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో జాతర జరిగే సమయం దగ్గర పడడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి భక్తుల సౌకర్యార్థం కావలసిన ఏర్పాట్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యం కోసం చేపట్టవలసిన అభివృద్ధి పనులపై వారు చర్చించి అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా అధికారులు చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, స్థానిక సర్పంచ్ కట్ల రాణి మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ గంట గోపాల్, సమ్మక్క సారక్క ఆలయ చైర్మన్ పర్శ శ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతల పంపిణీ



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్మికుల ఇలవేల్పు శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో చైర్మన్ మోడం ఉమేష్ గౌడ్ ఆధ్వర్యంలో అయోధ్య సీతారాములోని అక్షంతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పంపిణీ చేశారు. బుధవారం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఉమేష్ గౌడ్ నేతృత్వంలో గౌడ సంఘం నాయకులు, మహిళలు ఆలయంలోని పూజారి నరేష్ ఆచార్యచే అక్షింతలకు టెంకాయలను కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉమేష్ గౌడ్ తలపై అక్షింతల బిందెను, గౌడ పెద్దమనుషులు, కార్మికులు, భక్త మండలి సభ్యులు గీతా కార్మికుల ఇంటింటికి, వాడవాడలా ఊరేగింపుగా వెళ్లి అంగరంగ వైభవంగా అక్షింతలను గృహిణులకు(మహిళలకు) అందజేశారు. సంక్రాంతి, భోగి పండుగ, కనుమ పండుగలు పూర్తి కావడంతో బుధవారం కన్నుల పండుగగా అక్షింతల కార్యక్రమం చేపట్టి అందజేశారు. గ్రామంలలో భక్త మండలి ప్రజా ప్రతినిధుల ఊరేగింపులతో రామకీర్తనలతో అక్షింతల కార్యక్రమం పంపిణీ ఎంతో ఆకర్షణీయంగా సాగింది. ఈ కార్యక్రమంలో కుల పెద్దమనిషి మాడగాని శంకర్ గౌడ్, గండి శంకర్ గౌడ్, పొడేటి సుదర్శన్ గౌడ్, కొండ తిరుపతి గౌడ్, తడక మల్లేష్ గౌడ్, గండి వెంకన్న గౌడ్, కత్తి శంకర్ గౌడ్, మోటపోతుల సంతోష్ గౌడ్, భైరగాని రాజేందర్ గౌడ్, గండి తిరుపతి గౌడ్, తడుక సుధాకర్ గౌడ్, పూజారి భిక్షపతి గౌడ్, కొండ మల్లయ్య గౌడ్, మాడగాని సురేష్ గౌడ్, తడక శ్రీకాంత్ గౌడ్, బండి రమేష్ గౌడ్, బండి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

# సీఎం కుటుంబ సభ్యులను కలిసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కేంద్ర మాజీమంత్రి, బెస్ట్ పార్లమెంటేరియన్ దివంగత జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రావడానికి ముఖ్యపాత్ర పోషించిన జైపాల్ రెడ్డికి నివాళులర్పించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులను, జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ముఖ్యమంత్రి మామ పద్మాకర్ రెడ్డి, చిన్న మామ మనోహర్ రెడ్డి, సతీమణి గీతను, వారి కుటుంబ సభ్యులందరిని వరంగల్ ఎంపీ అస్పిరేంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అదేవిధంగా వరంగల్ నాయకులు జోసెఫ్ ప్రభాకర్ లాజరస్, సామ్ ఎలియా మహేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



# గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై అదనపు కలెక్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీసు గౌరవ వందనం, పరేడ్ కార్యక్రమాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పారిశుధ్యం నిర్వహణ మున్సిపల్ కమిషనర్ కు సూచిస్తూ వేదికను పుష్పాలంకరణ చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. ముఖ్య అతిథులకు ఆహ్వాన పత్రాలు అందించడం, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసే ఆహ్వానితులకు స్వాగతం పలుకుతూ సభ నిర్వహణను చేపట్టాలని ఆర్డీఓ మహబూబాబాద్ కు తెలిపారు. జిల్లా ప్రగతిపై రూపొందించే కాపీ ఏర్పాట్లను సీపీఓ, డీపీఆర్ఓ చూడాలన్నారు. ప్రెస్ గ్యాలరీ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కు సూచించారు. జాతీయ భావం ఉట్టిపడేలా సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై స్టాల్స్ ఏర్పాటు చేయాలని పలు శాఖ అధికారులకు సూచించారు. అగ్నిమాపక యంత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని ఫైర్ శాఖ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా 108 వాహనాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యశాఖ అధికారికి తెలియజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారికి సూచించారు. వేడుకలు నిర్వహించే స్థలాన్ని అధికారులు సందర్శించి ట్రయల్ రన్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, అదనపు ఎస్పీ చెన్నయ్య, జడ్పీ సీఈవో రమాదేవి, డీఆర్ డీ ఏపీడీ సన్యాసయ్య, ఉద్యాన శాఖ అధికారి సూర్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారి నరేష్, విద్యాశాఖ అధికారి రామారావు, సీపీఓ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంజీఎం సూపరింటెండెంట్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దివ్యాంగుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంజీఎం సూపరిండెంట్ డా. వలపదాసు చంద్రశేఖర్ ను బుధవారం ఘనంగా సత్కరించారు. ఎంజీఎంకు సంబంధించి ఓపీ విభాగంలో ప్రత్యేకంగా దివ్యాంగులకు ఓపీ సేవలను ప్రారంభించినందుకు జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ సంఘం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులందరు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు డా.ప్రసాద్, డా.శ్రీనివాసు, డా.ఆశాదేవిలతో పాటు సంఘ రాష్ట్ర బాధ్యులు నున్న నర్సమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి రామకృష్ణ, మహిళ ఉపాధ్యక్షురాలు ఆకవరపు స్వరూప, కార్యదర్శులు మిట్టపల్లి శివాజీ, బొప్పి ఉమారాణి, వైకె.కృష్ణ, కార్యవర్గ సభ్యులు రామిడి రవీందర్, గుండ ప్రభాకర్, జన్ను మాణిక్యం, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష్ మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలందరిని 12వారాల లోపు నమోదు చేయాలన్నారు. మొదటి రెండు చెక్ అప్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ, మూడు నాలుగు చెకప్ లు ఏరియా హాస్పిటల్ లోనూ, ఏరియా హాస్పిటల్ లో స్త్రీ వైద్య నిపుణులు స్కానింగ్ అందుబాటులో ఉంది. కాబట్టి, ప్రజలందరూ వినియోగించుకునేలాగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అసంక్రమిత వ్యాధులు, బీపీ, షుగర్, క్యాన్సర్ లను 30 సంవత్సరాల పైబడిన వాళ్లందర్నీ స్క్రీనింగ్ చేయాలని, ఫాలో అప్ ట్రీట్ మెంట్ ఆన్ లైన్ చేయాలని తెలిపారు. కీటకజనిత వ్యాధులైన మలేరియా డెంగి, చికెన్ గునియా, ఫైలేరియా రాకుండా ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలు అందరికి కూడా వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని కోరారు. అనంతరం హాస్పిటల్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జున్ రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఓ రుక్ముద్దీన్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం మధ్యాహ్నం మండలంలోని ఇప్పలపల్లి, గణేష్ పల్లి గ్రామాలల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో జీపీ బిల్డింగ్ కు సుమారు రూ.20 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన జీపీ భవనాలను ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఆశాలత, ఎంపీడీవో కృష్ణవేణిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సీతారామచంద్ర స్వామి ఆలయంలో చోరీ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ప్రసిద్ధిగాంచిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి వేళ విలువైన విగ్రహాలు అపహరణకు కు గురైన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో గుండేపూడి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గుడి వెనుక నుంచి గోడకు నిచ్చెన వేసి గోడపై నుంచి దూకి దొంగలు విగ్రహాలను అపహరించినట్లు తెలుస్తోంది. మూడు లక్షల రూపాయల విలువైన దేవుడి సేవలకు వినియోగించే పల్లకి, ఆంజనేయ, ఆశ్వ, గరుడ వాహనాలను దుండగులు చోరీ చేసినట్లు అర్చకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఆలయంలో ఇప్పటివరకు నాలుగు, ఐదు సార్లు చోరీలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

## టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి




**వరంగల్ వాయిస్, మరిపెడ :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ కు టీయూడబ్ల్యూ జే(ఐజేయూ) ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. మండల సర్వసభ్య సమావేశం అనంతరం జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, జర్నలిస్టులకు నివాస స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, నియోజకవర్గ కేంద్రమైన మరిపెడలో ప్రెస్ క్లబ్ నిర్మాణం కోసం స్థలం ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సత్తార్ పాషా, జిన్నా లచ్చయ్య, రాజేష్, చంద్ర శేఖర్, గోవర్ధన్, అక్తర్ పాషా, వేణు, వీరాంజీ, అశోక్, నాగరాజు, ఉప్పలయ్య, శ్రీశైలం, వెంకన్న, తదితర జర్నలిస్టులు ఉన్నారు.

# ఉర్దూ జర్నలిస్టుల ఎన్నికల్లో ఐజేయూ జయకేతనం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకుందామని వరంగల్ జిల్లా ఐజేయూ అధ్యక్షుడు శ్రీరామ్ రామ్ చందర్, కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్ అన్నారు. ఉర్దూ జర్నలిస్టులకు ఐజేయూ ఎప్పుడూ అండగా ఉండి సంఘ బలోపేతానికి సహకరిస్తుందని వారు పేర్కొన్నారు. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీలో విజేతలుగా ఐజేయూ జర్నలిస్టులు విజయం సాధించడం అభినందనీయమని తెలిపారు. వరంగల్ నగరంలోని ది అర్బన్ స్పైస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎండీ సాజిద్, ఉప అధ్యక్షుడు అబ్దుల్ అక్రమ్, కోశాధికారిగా ఎండీ అమీర్ గెలుపొందారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఐజేయూ అధ్యక్షుడు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కోశాధికారులు జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ అభినందన సభలో ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు సంగోజు రవి, మిద్దెల రంగనాథ్ యూనియన్ జిల్లా కోశాధికారి వడిచర్ల శ్రీనివాస్, వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు బాలవారి విజయ్ రాజ్, ఐజేయూ సభ్యులు చిన్నబాబు, జన్ను శ్యామ్, సిద్ధోజు నితీష్ పాల్గొన్నారు.




# మరోసారి పాడేందుకు రెడీ....

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు ఓ గుడ్ న్యూస్. ప్రజెంట్ పాలిటిక్స్ మీద ఆయన ఫుల్ కాన్సంట్రేట్ చేశారు. అందువల్ల, షూటింగులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆయన షూటింగ్ చేయడం లేదు గానీ... ఆయనతో సినిమాలు చేస్తున్న దర్శక నిర్మాతలు సినిమా మీద వర్క్ చేయడం ఆపలేదు. పవన్ నటిస్తున్న క్రేజీ సినిమాల్లో 'ఓజీ' ఒకటి. దీని గురించి సంగీత దర్శకుడు తమన్ ఓ అప్డేట్ ఇచ్చారు.  వన్ కళ్యాణ్ స్టార్ హీరో. ఆయన హీరో మాత్రమే కాదు... ఆయనలో ఓ సింగర్ కూడా ఉన్నారు. ఆయనతో పాట పాడించాలని తమన్ ప్లాన్ చేస్తున్నారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ చేస్తున్న సినిమా 'ఓజీ'. ఆ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'ఓజీ' స్క్రిప్ట్ లో పవన్ గారి చేత పాడించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. మేం ఆ అవకాశాలను పరిశీలిస్తున్నాం' అని చెప్పారు. పవన్ కళ్యాణ్ గనుక ఓకే అంటే... 'ఓజీ'లో ఆయన పాటను మనం వినొచ్చు. ఈ సినిమా కోసం ఆల్రెడీ తమన్ కొన్ని ట్యూన్స్ ఇచ్చారు. అందులో ఓ పాటను పుణెలో షూటింగ్ కూడా చేశారు. 'ఓజీ'లో పవన్ సరసన యంగ్ హీరోయిన్ ప్రియాంకా అరుల్ మోహన్ నటిస్తున్నారు. వాళ్లిద్దరిపై ఆ పాట తీశారు. ఇంతకు ముందు 'తమ్ముడు' సినిమాలో 'ఏం పిల్ల మాటాడవా' పాటతో మొదలు పెడితే... అందులోనే 'తాటి చెట్టు' నుంచి 'ఖుషి' సినిమాలో 'బై బయ్యే బంగారు రవణమ్మ...', 'జానీ' సినిమాలో 'నువ్వు సారా తాగకు', 'రావోయి మా ఇంటికి', 'పంజా'లో 'పాపారాయుడు', 'అత్తారింటికి దారేది'లో 'కామటరాయుడు', 'అజ్ఞాతవాసి' సినిమాలో 'కొడకా కోటేశ్వర్ రావు' పాటలు పాడారు.

## ప్రభాస్ చిత్రానికి రాజాసాబ్ పేరు ఖరారు

ప్రభాస్ హీరోగా దర్శకుడు మారుతి రూపొందిస్తున్న చిత్రానికి 'రాజా సాబ్' అనే పేరు నిర్ణయించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజా సాబ్' చిత్రాన్ని దర్శకుడు మారుతి రూపొందిస్తుండడంతో సినిమా మీద అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వింటేజ్ లుక్‌లో లుంగీ కట్టుకున్న ప్రభాస్ అందర్నీ ఆకట్టుకుంటున్నారు. సరదాగా, రొమాంటిక్‌గా సాగే క్యారెక్టర్ లుక్‌లో 'డార్లింగ్' ప్రభాస్‌ను చూడడంతో అభిమానులతో పాటు సినిమా లవర్స్ అందరికీ ఫ్రెష్ ఫీల్ కలుగుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లోనే ఒక కలర్‌ఫుల్ సినిమా చూడబోతున్న భావనని మారుతి కలిగించారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో 'రాజా సాబ్' ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రానికి కార్తీక్ పళని సినిమాటోగ్రఫీని, తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'మగధీర', 'బాహుబలి' చిత్రాలకు వి.ఎఫ్.ఎక్స్ అందించిన కమల్ కన్నన్ ఈ సినిమాను వర్క్ చేస్తున్నారు.






## క్లీంకార మీద అభిమానుల పాట

హీరో రామ్‌చరణ్-ఉపాసనల కుమార్తె క్లీంకారకు చిరంజీవి అభిమానులు తమ అభిమానాన్ని పాట రూపంలో తయారుచేసి పంపించారు. సంక్రాంతి సందర్భంగా ఆ పాటను తల్లి ఉపాసన విడుదల చేశారు. ప్రస్తుతం నెట్టింట్లో ట్రెండింగ్ అవుతున్న ఈ వీడియోను ఎక్కువమంది వీక్షిస్తున్నారు. 'కిలకిలా నవ్వింది క్లీంకార.. జగమంతా దీవించే మనసారా' అంటూ సాగే ఈ పాటను రఘు బెల్లంకొండ రాశారు. ధనుంజరు ఆలపించారు. 'చిన్నారి కోసం మేము అందించిన చిరు కానుక ఉపాసనకు నచ్చడం మా అదృష్టం' అని రఘు సంతోషాన్ని వ్యక్తంచేశారు. చిరంజీవి- అల్లు అరవింద్ కుటుంబ సభ్యులంతా బెంగుళూరులో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు.





## కలెక్షన్లలో .. నాసామిరంగా

కింగ్ నాగార్జున హీరోగా కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వంలో తెరకెక్కి.. ఈ సంక్రాంతికి థియేటర్లలోకి వచ్చిన 'నా సామిరంగ' చిత్రం విడుదలైన మూడు రోజుల్లోనే కలెక్షన్లు పండిస్తోంది. బ్రేకీవెన్‌కి దగ్గరగా వచ్చేసిన ట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాని నిర్మించారు. నాగార్జునకు జోడిగా ఆషికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో అల్లరి నరేష్, రాజ్ తరుణ్, మిర్నా మీనన్, రుక్సర్ థిల్లాన్ ఇతర కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా.. విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకుని.. విడుదలైన లిమిటెడ్ థియేటర్లలోనే భారీ కలెక్షన్స్ రాబడుతూ.. సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళుతోంది. తాజాగా మేకర్స్ ఈ చిత్రం బ్రేకీవెన్ కి దగ్గరగా వచ్చినట్లుగా తెలుపుతూ.. మూడు రోజులకు ఎంత కలెక్ట్ చేసిందో అధికారికంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్ ప్రకారం మూడో రోజు కూడా కిష్టయ్య కుమ్మేశాడు అనేలా కలెక్షన్స్ రాబట్టాడు. మొదటి రోజు 'నా సామిరంగ' సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 8.6 కోట్ల కలెక్షన్స్ రాబడితే.. రెండు రోజు రూ. 9.2 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను రాబట్టి మొత్తంగా రెండు రోజులకు కలిపి రూ. 17.8 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని రాబట్టినట్లుగా మేకర్స్ అధికారికంగా ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇక మూడో రోజు ఈ సినిమా రూ. 7.0 కోట్ల కలెక్షన్స్‌ను రాబట్టింది. మూడు రోజులకుగానూ ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ. 24.8 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ని రాబట్టినట్లుగా.. విడుదల చేసిన పోస్టర్‌లో మేకర్స్ తెలియజేశారు. 'నా సామిరంగ'కు లిమిటెడ్ థియేటర్లే లభించడంతో ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా తక్కువగానే జరిగింది. ఈ మూవీ రూ. 19 ప్లస్ కోట్ల షేర్ కలెక్షన్స్‌ని రాబడితే బ్రేకీవెన్ అయినట్లే. ప్రస్తుతం 3రోజులకి ఈ సినిమా రూ. 13 కోట్ల వరకు షేర్ రాబట్టినట్లుగా తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు పండగ ఈ సినిమాకు అడ్వాంటేజ్ అయింది. బుధవారం నుండి ఈ సినిమా రాబట్టే కలెక్షన్లే అత్యంత కీలకం కానున్నాయి. అయితే, పాజిటివ్ టాక్‌తో పాటు.. మరో వారం, పది రోజుల వరకు ఇతర సినిమాలేవీ లేవు కాబట్టి.. కచ్చితంగా 'నా సామిరంగ' బ్రేకీవెన్ అయ్యి, లాభాల బాట పట్టే అవకాశం ఉంది.



# మెరుగైన వసతులు కల్పించాలి

**త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**

**అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**మంత్రి సీతక్కతో కలిసి వన దేవతల సందర్శన**





**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ కుంభమేళగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 21 నుంచి 24వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న జాతరపై పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి సంస్థ, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి బుధవారం మేడారంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా కీర్తి గడించిన ఈ జాతరను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.75 కోట్లను జాతరకోసం కేటాయించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. పక్కా ప్రణాళికతో నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. లక్షలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మల దర్శనం కల్పించేందుకు పోలీసు యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, స్నాన ఘట్టాలను భక్తులకు చేరువలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణం చుట్టూ చలువ పందిల్లు ఏర్పాటు చేయాలన్నారు. జంపన్న వాగునుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రహదారుల ఆక్రమణను నియంత్రించాలన్నారు. జాతరకంటే ముందుగానే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు.

### గట్టమ్మను దర్శించుకున్న మంత్రి..

మేడారం సమ్మక్క-సారలమ్మల దర్శనంతోపాటు రివ్యూ సమావేశం నిర్వహించేందుకు బయలు దేరిన మంత్రి కొండా సురేఖ ములుగులో గట్టమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ములుగు జిల్లాకు విచ్చేసిన మంత్రి సురేఖకు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వాగతం పలికారు. మేడారం మహా జాతరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తల్లిని కోరుకున్నానన్నారు. మొదటి సారి మంత్రి హోదాలో ములుగు జిల్లాకు రావడం గట్టమ్మ తల్లిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మేడారం చేరుకున్న ఆమెకు ఘన స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ మంత్రి హోదాలో మొదటి సారి మేడారం విచ్చేసిన మంత్రి సురేఖకు మేడారం గిరిజన పూజారులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వన దేవతలను సందర్శించుకున్నారు. మంత్రి కొండా సురేఖ నిలువెత్తు బంగారం వన దేవతలకు సమర్పించారు. మంత్రి హోదాలో మొదటి సారి అమ్మవార్లను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మేడారాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తి సహకారం అందిస్తానన్నారు. మేడారంలో జరుగుతున్న పనులు జనవరి నెలాఖరు వరకు పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

### అతిథి గృహం శంకుస్థాపన..

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో పూజారులు అతిథి గృహం సముదాయ నిర్మాణ పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. రూ.1.5 కోట్లతో దీనిని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క మాట్లాడుతూ మేడారం గిరిజన జాతరలో పూజారుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. వారి కోసమే ప్రత్యేకంగా ప్రభుత్వం 10 గదులలో అతిథి గృహ నిర్మాణం చేపడుతుందన్నారు. జాతర సమయానికి ఈ అతిథి గృహం అందుబాటులోకి వస్తుందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శభరిష్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్, అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) పి.శ్రీజ , అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, దేవాదాయ శాఖ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### సానిటేషన్ షెడ్ ప్రారంభం..

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో పంచాయతిరాజ్ ఇంజనీరింగ్ విభాగంలోని రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సానిటేషన్ షెడ్ ను బుధవారం రాష్ట్ర పంచాయతి రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మేడారం మహా జాతర సమయంలో కోటి మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి శానిటేషన్ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు జరిగేలా చూడాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.





# దేవాలయాలు శుభ్రం

**ప్రధాని పిలుపుతో స్పందించిన బీజేపీ నేతలు**

**స్వచ్ఛ తీర్థ అభియాన్‌కు విశేష స్పందన**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వచ్ఛ తీర్థ మహా అభియాన్ కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభించింది. బీజేపీ నేతలు పెద్ద ఎత్తున తరలి వచ్చిన నగరంలోని పలు దేవాలయాలను శుభ్రం చేశారు. అయోధ్యలో శ్రీ రామచంద్రుడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దేశంలో ఈనెల 14 నుంచి 22 వరకు వారం రోజుల పాటు ప్రతి గ్రామం-నగరం, పుణ్యక్షేత్రాలు, మతపరమైన పర్యాటక ప్రదేశాలు, దేవాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, రోడ్లు, వీధులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ మహా అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం వరంగల్ చౌరస్తాలోని ఆకారపు వారి కాశీ విశ్వేశర స్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పార్టీలకు అతీతంగా ప్రతి హిందువు తమ ప్రాంతంలోని దేవాలయాలను శుభ్రపరచాలని కోరారు. ఈ స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, బీజేపీ నాయకులు గంట రవికుమార్, రత్నం సతీష్ షా, చీటూరి అశోక్, ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఉపాధ్యక్షులు ఎరుకల రఘునాథ్ రెడ్డి, అపురూప రజనీష్ నేత, ధర్మపురి రామారావు, జెట్లింగ్ శివప్రసాద్, అంకాల జనార్ధన్, ఇనుముల రాజు, గడ్డం భాస్కర్, కాంద్రాతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో అడ్మిషన్లకు ఆహ్వానం




**వరంగల్ వాయిస్, ములుగు :** 2024 విద్యా సంవత్సరానికి టీఎంఆర్ఎస్ ములుగు దేవగిరిపట్నం పాఠశాలలో అడ్మిషన్ కోసం ఆహ్వానం పలుకుతుందని ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చున్నారు. ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, జైనులు, సిక్కులు, బౌద్ధులతో సహా నాన్ మైనారిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐదో తరగతిలో అడ్మిషన్ తీసుకోవచ్చున్నారు. ముందుగా వచ్చిన ముస్లింలకు అవకాశం ఉంటుందన్నారు. నాన్ మైనారిటీ కోటాలో లక్కి డిప్ ద్వారా ఎంపిక చేయనున్నట్లు ప్రకటించారు. ఇతర వివరాలకు www.tmreistelangana.cgg.gov.in లేదా ఫోన్ 7995057915 లో సంప్రదించాలన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com